- జిల్లా పట్ల వివక్ష చూపిస్తున్న కాంగ్రెస్
- జెండా ఎగురవేసేది ఒకరు.. ఎజెండా తయారు చేసేది మరొకరు
- నిధులు రాకున్నా నోరు మెదపని మంత్రులు
- పోరాటాల గడ్డను మరో పోరాటానికి సిద్ధం అయ్యేలా చేయకండి
- 'ఆంధ్రజ్యోతి'తో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

జిల్లాకు ఒక్క రూపాయి కూడా రాలేదు..

ఏడాది కాలంగా జిల్లాకు ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదు. కరీంనగర్ పట్టణంలో బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసిన నాలుగు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణ పనులు ఆగిపోయాయి. వీటికి మేము రెండున్నర కోట్లు మంజూరు చేస్తే 60శాతం పనులు పూర్తయ్యాయి. మరో 40శాతం పనులకు నిధులు విడుదల చేయడం లేదు. సాక్షాత్తు ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన పనులను కూడా నిలిపివేశారని గంగుల కమలాకర్ అన్నారు. 80 కోట్లతో చేపట్టిన 40 అంతర్గత రోడ్ల పనులు ఎక్కడికక్కడ కంకర వేసి ఆపేశారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మానేరు రివర్ ఫ్రంట్ పనులను మూలకు నెట్టారు. రెండు కోట్ల 25 లక్షల రూపాయలు ఈ ప్రాజెక్టుకు మంజూరు చేస్తే మధ్యలో నిలిపివేశారు.



పదేళ్ల అభివృద్ధి.. ఏడాదిలో విధ్వంసం

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

"తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జిల్లాలో పదేళ్లలో జరిగిన అభివృద్ధిని ఏడాది తిరగక ముందే విధ్వంసం చేశారు. హైదరాబాద్ తర్వాత సుందరనగరంగా తీర్చిదిద్దిన కరీంనగర్‌ను కళావిహీనం చేశారు. పక్కనే ఉన్న పెద్దపల్లి, వరంగల్ జిల్లాలకు వరదలా నిధులను విడుదల చేస్తూ ఈ జిల్లా పట్ల మాత్రం వివక్ష చూపిస్తున్నారు. ఈ జిల్లాకు ఇంచార్జి మంత్రి ఉన్నారా..., ఇక్కడ మంత్రులు ఉన్నారా లేరా... ఉంటే వారు ఎందుకు నోరు మూసుకుంటున్నారు.. జెండా ఎగురవేసేది ఒకరు.. ఎజెండా నిర్ణయించేది మరొకరు... అనుభవం లేని పాలన, వివక్ష కారణంగా జిల్లాలో అభివృద్ధి కుంటుపడుతోంది"... అన్నారు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తున్నదని, వివక్షకు గురిచేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అభివృద్ధిని అడ్డుకోకండి... పోరాటాల పురిటిగడ్డ కరీంనగర్‌ను మళ్లీ పోరాటం చేసే పరిస్థితి రానివ్వకండి.. అంటూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏ ప్రభుత్వం ఉన్నా అభివృద్ధి అనేది నిరంతరం జరుగాల్సిన ప్రక్రియ. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో అభివృద్ధి ఆగిపోయింది. పది సంవత్సరాల పాటు స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దిన కరీంనగర్ గుడ్డి దీపంగా మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

• వినియోగంలో లేని కేబుల్ బ్రిడ్జి లైటింగ్ సిస్టమ్

దక్షిణభారత దేశంలో రెండవదిగా మంజూరైన కేబుల్ బ్రిడ్జిని నిర్మించి డైనమిక్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తే దానిని వినియోగంలో లేకుండా చేశారని కమ లాకర్ ఆరోపిం చారు. కేబుల్ బ్రిడ్జిపై తారు తీసేసి ఏడాది గడిచినా కొత్తగా తారు వేయించి దాన్ని వినియోగంలోకి తీసుకురావడం లేదు. పట్టణంలోని రోడ్లపై పెద్దపెద్ద గుంతలు పడ్డా మేయింటెనెన్స్ పనులు చేపట్టడం లేదని అన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ పనులపై విజిలెన్సు ఎంక్వైరీ జరుగుతుందని చెబుతున్న ప్రభుత్వం విజిలెన్సు ఎంక్వైయిరీ రిపోర్టులో ఏమి తేలిందో బహిర్గతం చేయాలని కమలాకర్ డిమాండ్ చేశారు. విజిలెన్సు పేరుతో బ్లాక్‌మెయిల్ రాజకీ యాలు చేయడం మాని పనులు కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. మానేరు ఒడ్డున ఇస్కాన్ టెంపుల్‌కు మూడెకరాల స్థలాన్ని కేటాయిస్తే ఆ భూ మిని వాపస్ తీసుకొని హిందువుల మనోభావాలను, గ్రేవ్‌యార్డుకు కేటాయించిన పది ఎకరాల భూమిని వాపస్ తీసుకొని ముస్లింల మనోభావాలను ప్రభుత్వం దెబ్బతీసింది.

• టీటీడీ ఆలయ నిర్మాణంపై చంద్రబాబును కలుస్తాం

కరీంనగర్ పట్టణంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా చేశాము. ఈ సారి బ్రహ్మోత్సవాలు చేస్తారా లేదా ప్రకటించడం లేదు. డిసెంబర్‌లో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ప్రతిపాదిస్తేనే అవి నిర్వహించడానికి అవకాశం

మిగతా 8వ పేజీలో...

నేటి నుంచి సీఎం కప్ క్రీడలు

- ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహణ
- గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలో పోటీలు



ఖో-ఖో ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెం బర్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీఎం కప్ క్రీడా పోటీలకు కరీంనగర్ ముస్తాబైంది. ఉమ్మడి జిల్లాస్థాయిలో నిర్వహించనున్న పోటీలకు జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పోటీల్లో పాల్గొనాలనుకునే ఔత్సాహిక క్రీడాకారులు ముందుగా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలనే ఆంక్షలతో నామమాత్ర స్పందన వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. శనివారం నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా క్రీడలు ప్రారంభమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలోని వివిధ మండలాల్లో గల గ్రామాల్లో గ్రామ కార్యదర్శులు ఏర్పాట్లను పూర్తి చేశారు. గ్రామస్థాయి యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి వారిని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చి దిద్దాలని ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఏర్పాట్లు పూర్తి అయినప్పటికీ క్రీడల్లో పాల్గొనే యువత రిజిస్ట్రేషన్ చేసుకోవడంలో ఇబ్బందికి గురవుతున్నారు. గ్రామస్థాయిలో ప్రతిభచాటిన క్రీడాకారులను ఈ నెల 10, 11, 12 తేదీల్లో మండలస్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపిక చేయనున్నారు. జిల్లాస్థాయిలో నిర్వహించనున్న పోటీలకు మండల స్థాయిలో ప్రతిభచాటే క్రీడాకారులను జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారు. జిల్లాస్థాయిలో 20 క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించి అక్కడ ప్రతిభ చాటే క్రీడాకారులను రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపిక చేయనున్నారు.

10 నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె



కలెక్టరేట్ ఏవోకు సమ్మె నోటీసు అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సుభాష్‌నగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యాశాఖ సమగ్రశిక్ష ఉద్యోగులు ఈ నెల 10 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుండా రాజిరెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ఏవో, జిల్లా విద్యాశాఖ సూపరింటెండ్‌లకు సమ్మె నోటీసు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ సమస్యలను ఇంత వరకు పరిష్కరించలేదని, పదిహేను రోజుల క్రితం నిరవధిక సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రానందున జిల్లా వ్యాప్తంగా సమగ్రశిక్ష ఉద్యోగులు సమ్మెలోకి వెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చంద్రగిరి మహేశ్, సల్లోజు రజనీకాంత్, పురుషోత్తం, భరత్, కనుకుల రమేశ్, జనగామ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వంద కోట్లతో నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి

- మేయర్ యాదగిరి సునీల్‌రావు



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టణానికి 100 కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చి పాలకవర్గం అండతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని మేయర్ సునీల్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని 36వ డివిజన్ మంకమ్మతోటలో నూతనంగా చేపట్టనున్న మంచినీటి పైపులైను నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ నిధులతో నగరంలో వచ్చే 30 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నగరంలోని 60 డివిజన్లతోపాటు విలీన గ్రామాల్లో మంచినీటి పైపులైన్లు వేసి నీటిని అందిస్తామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. పారిశుధ్య పనులను మరింత మెరుగుపరిచేందుకు త్వరలోనే కొత్తగా మరో 10 స్వచ్ఛ ఆటోలను, 30 ట్రాక్టర్లను కొనుగోలు చేస్తున్నామని అన్నారు. అలాగే డివిజన్ 12చొప్పున 60 డివిజన్లలో 720 మినీ హైమాస్టు లైట్లను గతంలో చేసిన తీర్మానం మేరకు ఏర్పాటు చేస్తామన్నారు. నగరంలో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్స్, ఓపెన్‌జిమ్స్, పార్కులను వృద్ధులు, మహిళలు, యువకులు, అన్నివర్గాల వారు ఉపయోగించుకుంటున్నారని అన్నారు. తమ పాలకవర్గం చేసిన అభివృద్ధి నగర ప్రజలకు కనిపిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీశ్రీనివాస్ పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో హోంగార్డులు

- పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి
- ఘనంగా 78వ హోంగార్డ్స్ రైసింగ్ డే



కార్యక్రమానికి హాజరైన హోంగార్డులు

మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో హోంగార్డులు ఎక్కువగా ప్రజలకు అందుబాటులో ఉంటా రని, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. 78వ హోంగార్డ్స్ రైసింగ్ డే సందర్భంగా పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో శుక్రవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ హోంగార్డ్‌ల సేవలను గుర్తు చేసుకునేందుకు ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా డిసెంబర్ 6వ తేదీన హోంగార్డ్స్ రైసింగ్ డే జరుపుకుంటామని తెలిపారు. పోలీస్ శాఖలోని అన్ని విభాగాల్లో హోంగార్డులు సేవలు అందిసు ్తనారన్నారు. కరీంనగర్ కమిషనరేట్‌లో ముఖ్యంగా బ్లూకోల్ట్స్, ట్రాఫిక్, శాంతిభద్రతల విధులు, నైట్ పెట్రోలింగ్‌లతో పాటు కమిషనరేట్‌లో దాదాపు హోంగార్డులు పనిచేయని విభాగం లేదన్నారు. గడిచిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో కూడా వారికి కేటాయించిన విధులు చాలా అద్భుతంగా నిర్వహించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. యూనిఫామ్ ధరిం చాక అందరం సమానమమేనని అన్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా హోంగార్డులకు కేటాయించిన విధుల్లో ప్రతిభ కనబరిచిన 15మంది హోంగార్డులను గుర్తించి వారికి సీపీ ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రొబేషనరీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫౌరేబి, అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ, ఆర్ఐలు మోడెం సురేష్, శ్రీధర్‌రెడ్డి అధికారులు, హోంగార్డులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలకు నిరాశ్రయుల తరలింపు

- పోలీసుల స్పెషల్‌డ్రైవ్



నిరాశ్రయులను పునరావాస కేంద్రానికి తరలిస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6(ఆంధ్ర జ్యోతి): కరీంనగర్‌లో గురువారం అర్ధరాత్రి కరీంనగర్ ఏసీపీ గోపతి నరేం దర్ ఆధ్వర్యంలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి రోడ్లపై, కూడళ్లలో నిద్రిస్తున్న, వీధుల్లో తిరుగుతున్న నిరాశ్రయులను గుర్తించి పునరావాస కేంత్రాలకు తర లించారు. అర్ధరాత్రి సమయాల్లో అనువ ానాస్పదంగా తిరుగుతున్న వారిని పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ డివైజ్‌తో వేలి ముద్రలను తనిఖీ చేసి గతంలో ఏమైనా నేరాలకు పాల్పడ్డారా? అనే అనుమానాలను నివృత్తి చేసుకున్న అనంతరం 40 మందిని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న కోతిరాంపూర్‌లోని ప్రభుత్వ పునరావాస కేంద్రానికి తరలించినట్లు కరీంనగర్ ఒకటో టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో రెండో టౌన్ సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైస్ మిల్లుల్లో అధికారుల తనిఖీలు

తిమ్మాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అలుగునూర్‌లో గల రైస్ మిల్లులను శుక్ర వా రం కాలుష్య నియంత్రణ మండలి అధికా రులు తనిఖీలు చేశారు. అలుగునూర్‌లోని శ్రీ సీతారామాంజనేయ, విజయలక్ష్మి, ఓంకార్ రైస్ మిల్లులతో భారీగా కాలుష్యం వస్తోందని స్థా నిక జాప విజయ భాస్కర్‌రెడ్డి, మల్లారెడ్డి పొల్యూషన్ బోర్డుకు ఫిర్యాదు చేశారు. పొల్యూ షన్ బోర్డు అధికారులు సంబంధిత రైస్ మిల్లుతో పాటు ఇతర రైస్ మిల్లుల పరిసరా లను తనిఖీ చేశారు. రైస్ మిల్లుల నుంచి వ్యర్థాలతో గాలి, నీటి కాలుష్యం జరుగుతుం దని ప్రాథమికంగా గుర్తించారు. రైస్ మిలు ్లలతో ఏర్పడే కాలుష్యాన్ని తగ్గించుకోవాలని రైస్ మిల్లు నిర్వాహకులను ఆదేశించారు. నివేదికను ఉన్నతధికారులకు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో పొల్యూషన్ బోర్డు ఈఈ భిక్షపతి, ఏఈ వీరేశం, ఫిర్యాదుదారులు, రైస్ మిల్లుల నిర్వాహకులు పాల్గొన్నారు.



అలుగునూర్‌లోని రైస్ మిల్లుల్లో తనిఖీలు చేస్తున్న కాలుష్య నియంత్రణ అధికారులు

పెండింగ్ బిల్లులు చెల్లించండి

- మాజీ సర్పంచ్‌ల జేఏసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీరాజం



గంగాధర ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మాజీ సర్పంచ్‌లు

గంగాధర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌ల బిల్లులు విడుదల చేయాలని తాజామాజీ సర్పంచ్‌ల జేఏసీ జిల్లా అధ్యక్షుడు జోగు లక్ష్మీరాజం డిమాండ్ చేశారు. శుక్రవారం గంగాధర ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎంపీడీవో రాముకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసి బిల్లులు రాక అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకుంటున్నారు. గెలిచిన తరువాత పెండింగ్ బిల్లులు విడుదల చేస్తామని హామీ ఇచ్చి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటి వరకు బిల్లులు విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 9 నుంచి కలెక్టరేట్ ఎదుట చేపట్టే రిలే నిరాహార దీక్షకు జిల్లాలోని తాజామాజీ సర్పంచ్‌లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు నవీన్‌రావు, నాయకులు మడ్లపల్లి గంగాధర్, దామోదర్, నజీర్‌హుస్సేన్, రాసూరి మల్లేశం, కనుకయ్య, శంకర్, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆసరా పింఛన్లు అందేనా?

- పెండింగ్‌లో 650 దరఖాస్తులు

కరీంనగర్ రూరల్, డిసెంబర్6(ఆంధ్రజ్యోతి): పేదలకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అంది స్తున్న ఆసరా పింఛన్ల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చినా ఇంకా అమలుకు నోచుకోవడం లేదు. కొత్త పింఛన్ల కోసం అర్హులు ఎదురు చూస్తున్నా మోక్షం కలుగడం లేదు. కాంగ్రెస్ ప్రజాపాలన సంబరాల్లోనైనా కొత్త పింఛన్లు ఇవ్వాలని పేదలు కోరుతున్నారు. కరీంనగర్ మండలంలో మొత్తం 4,883 మంది లబ్ధిదారులకు ఆసరా పింఛన్లు అందుతున్నాయి. వృద్ధులు 2,185 మంది, వికలాంగులు 666 మంది, చేనేత 1469, గీత కార్మికులు 146, ఒంటరి మహిళలు 94, బీడీ కార్మికులు 208 మందికి ప్రతి నెల 1కోటి 32లక్షల72 వేల 944 రూపాయలను అందిస్తుంది. ప్రభుత్వం స్పందించి వెంటనే అర్హులైన వారికి నూతన పింఛన్లు మంజూరు చేయాలని పేదలు కోరుతున్నారు.



క్రైం కార్నర్

బస్సు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

గంగాధర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గంగాధర ప్రధానరహదారిపై శుక్రవారం ఆర్టీసీబస్సు, ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి డిపోకు చెందిన బస్సు కరీంనగర్ వైపు వస్తుంది. రామడుగు మండలం వెదిర గ్రామానికి చెందిన భరత్ తన చెల్లి వివాహానికి హాజరైయ్యేందుకు జగిత్యాల వైపు వెళుతున్నాడు. గంగాధర మండలం మధురానగర్ వద్ద ప్రధాన రహదారిపై భరత్ ద్విచక్రవాహనాన్ని బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో భరత్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు భరత్‌ను కరీంనగర్ తరలించారు. దీనిపై ఎస్‌ఐ నరేందర్‌రెడ్డిని వివరణ కోరగా ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి..

హుజూరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో శుక్రవారం బైక్ అదుపుతప్పి కింద పడిన ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెంజర్ల గ్రామానికి చెందిన శివప్రసాద్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. పట్టణంలోని నటరాజ్ థియేటర్ సమీపంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో శివప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అనారోగ్యంతో వృద్ధురాలు ఆత్మహత్య

గంగాధర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుబూత్కూర్‌కు చెందిన ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపి వివరాల ప్రకారం.. మండలంలోని గట్టుబూత్కూర్‌కు చెందిన గుండ లక్ష్మి(61) మూడేళ్లుగా నరాల వ్యాధితో బాధపడుతున్నది. చికిత్స తీసుకున్నా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెంది శుక్రవారం గ్రామ సమీపంలోని మంచినీటి బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. లక్ష్మి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

దొంగలించిన బైక్‌ను పట్టుకున్న పోలీసులు

శంకరపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి దొంగలించిన బైక్‌ను తీసుకెళ్తుండగా వాహనాల తనిఖీలో భాగంగా శుక్రవారం కేశవపట్నం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని మొలంగూర్ ఎక్స్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా గుండె శివప్రసాద్ అనే వ్యక్తి అనుమానా స్పదంగా బైక్(టీఎస్36జీ750)పై వెళుతున్నట్లు పోలీసులు గమనించారు. శివప్రసాద్‌ను విచారణ చేయగా శంకరపట్నం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో బొగోతం రాకేష్ ఇంటి ఎదుట పార్కింగ్ చేసి ఉన్న బైక్‌ను బండారి రాజశేఖర్‌తో కలిసి దొంగలించినట్లు ఒప్పుకున్నాడు. ఏ1 బండారి రాజశేఖర్ పరారీలో ఉన్నాడని, ఏ2 శివప్రసాద్ వద్ద ఉన్న బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. శివప్రసాద్‌ను అరెస్టు చేసి హుజూరాబాద్ కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై కొత్తపల్లి రవి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని శాలపల్లి ఇందిరానగర్ గ్రామం మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం రాత్రి సీఐ తిరుమల్‌గౌడ్ పట్టుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నందుకు గాను ట్రాక్టర్ సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

చిన్నకలువల ఎల్లమ్మ గుడిలో చోరీ

సుల్తానాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్న కలువల గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయంలో చోరీ జరిగింది. శుక్రవారం ఉదయం దొంగతనం విషయం వెలుగుచూసింది. ఎల్లమ్మతల్లి మెడలో ఉన్న బంగారు పుస్తెతో పాటు భక్తులు మొక్కులు చెల్లించుకున్న వెండి పడిగెను ఎత్తుకుపోయారని గౌడకులస్థులు తెలిపారు. శుక్రవారం ఉదయం పోలీసులు గుడికి వచ్చి పరిశీలించారు.

మల్యాలలో చోరీ



ఇంట్లో చిందర వందరగా పడేసిన వస్తువులు

చందుర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాలకు చెందిన పల్లి కొండ సత్తవ్వ ఇంట్లో చోరీ జరిగింది. సత్తవ్వ వారం రోజుల క్రితం ఇంటికి తాళంవేసి సిరిసిల్లలోని పెద్దకొడుకు ఇంటికి వెళ్లింది. శుక్రవారం ఇంటికి తిరిగి వచ్చేసరికి తలుపుల తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం పగలగొట్టి లక్ష రూపాయలతోపాటు తులం బంగారం చోరీకి గురైనట్లు గుర్తించింది. ఈ సంఘటనపై విచారణ జరుపుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శంకర్ తెలిపారు.

అదనపు కట్నం కేసులో భర్తకు ఏడాది జైలు శిక్ష

వేములవాడ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు శిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ వేములవాడ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి జ్యోతి శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బోయినపల్లి మండలం తడగొండకు చెందిన మహేందర్‌కు గంగాధర మండలం పిట్టలపల్లికి చెందిన మమతతో 2011లో వివాహమైంది. కొన్నేళ్ల తర్వాత మహేందర్ అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధింపులకు గురిచేశాడు. వేధింపులు భరించలేక 2017లో బోయినపల్లి పోలీస్ స్టేషన్లో మహేందర్‌పై బాధితురాలు ఫిర్యాదు చేసింది. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో మహేందర్‌కు శిక్ష విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామానికి చెందిన పత్తి భూమయ్య(54) అనే వ్యక్తి అనారోగ్యంతో శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భూమయ్య శుక్రవారం మధ్యాహ్నం గ్రామంలోని పాత ఇంటికి వెళ్లి తలుపులు బిగించుకుని ఇంటిలోని దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు భూమయ్య కొడుకు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పోలీసుల విధులను ఆటంకపరిచిన ఇద్దరిపై కేసు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని గణేష్ నగర్‌లో గురువారం రాత్రి పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ ఎండీ నజీముద్దీన్, మరో కానిస్టేబుల్, హోంగార్డుల విధులను ఆటంకపరచి దుర్భాషలాడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. గణేష్‌నగర్‌లో ఒక కారు పోలీసు సైరన్‌తో తిరుగుతున్నట్లు బ్లూకోల్ట్స్ పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి ఏఎస్‌ఐ బృందం వెళ్లి కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులను బ్రీత్‌ఎనలైజర్‌తో పరీక్షించేందుకు ప్రయత్నించారు. అందుకు వారు నిరాకరించటంతోపాటు దుర్భాషలాడారని, విధులను ఆటంకపరిచారని ఏఎస్‌ఐ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు బానోతు రాజేందర్, మాలోతు శేఖర్‌పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.



తోటలో నుంచి మార్కెట్‌కు కూరగాయలను తరలిస్తున్న రైతులు



బెండ కాయలు తెంపుతున్న రైతులు

కూరగాయల సాగుకు కేరాఫ్ బంజేరుపల్లి



మామిడి తోటలో అంతర్ పంటగా కాలిఫ్లవర్ వేసిన రైతులు

● ఏక కాలంలో రెండు పంటలతో అధిక లాభాలు పొందుతున్న రైతులు

ధర్మారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మిగతా పంటల కంటే కూరగాయల సాగు కొంత కష్టంతో కూడుకున్నది. నిత్యం పురుగు, వైరస్ ఆశించి నష్టం కలిగిస్తాయి. అయినప్పటికీ పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని బంజేరుపల్లికి చెందిన రైతులు ఇష్టంతో కూరగాయలు పండిస్తున్నారు. అంతేకాకుండా ప్రతి సీజన్‌లోనూ ఏక కాలంలో రెండు రకాల పంటలు పండించేలా ప్లాన్ చేసుకుంటూ అధిక లాభాలు పొందుతున్నారు. గ్రామంలోని చాలా మంది రైతులు టమాట, అలసంద, చిక్కుడు, బీర, బెండ, వంకాయతో పాటు అధిక లాభాలు తెచ్చిపెట్టే కాలిఫ్లవర్‌ను అంతర పంటగా సాగు చేస్తున్నారు.



ఆయిల్‌పామ్ తోటలో అంతర్ పంటగా టమాట నారు

● అంతర్ పంటలతో అధిక లాభాలు..

కూరగాయల సాగులో బంజేరుపల్లి గ్రామరైతులు వినూత్న పద్ధతులను పాటిస్తున్నారు. ఏక కాలంలో రెండు పంటలు సాగు చేయడం అలవాటు చేసుకున్నారు. మామిడి, ఆయిల్‌పామ్ తోటలో అంతర్ పంటలుగా కాలీఫ్లవర్, టామట పండిస్తున్నారు. అలాగే తీగ జాతి పంటలైన బీర, చిక్కుడు పబ్బులను రెండు పంటలకు పనికి వచ్చేలా ఏర్పాటు చేస్తున్నారు. మొదట బీర నారు పెట్టి, 20 రోజుల తర్వాత అదే స్థానంలో చిక్కుడు నారు పెడుతారు. సాధరణంగా బీరకాయలు 2 నుంచి 4 నెలల వరకు కాస్తాయి. అవి పూర్తి అయ్యేలోపు చిక్కుడు కాయలు కాస్తాయి. ఇలా ఒకే స్థలంలో రెండు పంటలు తీస్తూ లాభాల సాధిస్తున్నారు.

● ఏక కాలంలో రెండు పంటలు..



గత 10 సంత్సరాలుగా కూరగాయలు సాగు చేస్తున్నాను. కష్టంతో కూడకున్న పంటలు అయినప్పటికీ ఇష్టంతో చేస్తున్నాను. ఒకే సమయంలో రెండు పంటలు తీయడం నాకు అలవాటు. మామిడి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర్ పంటలుగా టమాట, కాలీఫ్లవర్ పండిస్తాను. అలాగే బీర, చిక్కుడు కాయలు ఒకదాని వెంట ఒకటి కాసేలా ప్లాన్ చేసుకుంటాను.

\- గడ్డం ప్రభాకర్‌రెడ్డి

● ఐదు ఎకరాల్లో పండిస్తాం..



మేము ప్రతి సంవత్సరం 3 నుంచి 5 ఎకరాల్లో కూరగాయలు పండిస్తాం. నేను, నా భర్త కష్టపడి పనిచేస్తాం. బెండ, చిక్కుడు తెంపేటప్పుడు మాతో పాటు కైకిల్లోను పెట్టి తెంపుతాం. తోటల నుండి మేన్ రోడ్ల వరకు బండ్లపై కూరగాయలు తరలిస్తాము. అక్కడి నుండి బేరగాల్లు వచ్చి తీసుకెళ్లారు. ఒక ఎకరానికి లక్ష వరకు సంపాదిస్తాం.

\- గడ్డం జమున-మల్లారెడ్డి

లైన్ క్లియర్..

● రామగుండంలో వంద పడకల ఈఎస్‌ఐ ఆసుపత్రి
● 30వేల కుటుంబాలకు ప్రయోజనం...
● రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసిన కేంద్రం

కోల్‌సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో పెండింగ్‌లో పడ్డ 100పడకల ఈఎస్‌ఐ ఆసుపత్రి నిర్మాణానికి లైన్ క్లియర్ అయ్యింది. ఆసుపత్రి ఏర్పాటుకు ఆమోదం తెలుపుతూ కేంద్రం ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చినట్టు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రానికి చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. కేంద్రం గతంలో రామగుండానికి 100పడకల ఈఎస్‌ఐ ఆసుపత్రి మంజూరు చేసింది. అప్పటి ప్రభుత్వం స్థలం ఇవ్వకపోవడంతో ఆసుపత్రి ఏర్పాటు పెండింగ్‌లో పడింది. జాప్యం జరుగడంతో ఏర్పాటు ప్రక్రియ మూలన పడంది. రామగుండం పట్టణంలోని ఈఎస్‌ఐ డిస్పెన్సరీ స్థలంప్రాంగణంలోనే ఆసుపత్రి ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. తాజాగా సవరించిన అంచనాలతో ఆసుపత్రి నిర్మాణం చేయనున్నారు. ఈ ఆసుపత్రి నిర్మాణం జరిగితే సూపర్ స్పెషాలిటీ వైద్యం ఈఎస్‌ఐ ఖాతాదారుల కుటుంబాలకు లభించనున్నాయి. ప్రస్తుతం ఈఎస్‌ఐ ఖాతాదారులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రామగుండం ప్రాంతంలో సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, మున్సిపల్ కార్పొరేషన్ ఇతర ప్రైవేట్ సంస్థలతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలోని సుమారు 30వేల మంది కార్మిక కుటుంబాలకు ప్రయోజనం చేకూరనున్నది. అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వం, ఈఎస్‌ఐ కార్పొరేషన్లు ఆసుపత్రి నిర్మాణం తరువాత మరిన్ని నిధులు మంజూరు చేసే అవకాశం ఉంది. త్వరలోనే నిధుల విడుదలకు సంబంధించి జీవో విడుదల కానున్నది.

● సీఎం విజ్ఞప్తి మేరకు నిర్ణయం...

రామగుండం ఈఎస్‌ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుతానికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆసుపత్రి నిర్మాణానికి అన్ని రకాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆసుపత్రి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం లైన్ క్లియర్ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి, శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు.

\-ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

ఉయ్యాల ఉరితాడైంది..

● ఉయ్యాల మెడకు చుట్టుకుని బాలిక మృతి

మానకొండూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి వచ్చి ఇంట్లో ఉన్న చీరతో కట్టిన ఉయ్యాల ఊగుతూ అదే చీర మెడకు ఉరిపడి ఓ బాలిక మృతి చెందింది. కరీంనగర్‌లోని వావిలాలపల్లికి చెందిన సైరున్నీషా-ముజఫర్ దంపతులకు కుమార్తె ఆయేషా తబుస్సం (14). సైరున్నీషా తన స్వగ్రామమైన కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని లక్ష్మీపూర్‌లో తన తమ్ముడి వివాహం ఉండటంతో కుటుంబంతో కలసి గ్రామానికి వెళ్లింది. శుక్రవారం ఇంట్లో వారందరూ పనిలో ఉండగా రేకుల షెడ్డులో చీరతో కట్టిన ఉయ్యాలలో ఆయేషా తబుస్సం ఊగుతూ మెడకు చుట్టుకొని ఉరిపడింది. తల్లి రేకుల షెడ్డులోకి వచ్చి చూసే సరికి మెడకు ఉరిపడడాన్ని గమనించి కేకలు వేసింది. దీంతో కుటుంబ సభ్యులు ఆయేషాను 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే తబుస్సం మృతి చెందిందని తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నిట్టూరు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో డిసెంబరు 1న కబడ్డీ అసోసియేషన్ ఉమెన్స్ కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిట్టూరు పాఠశాల నుంచి ముక్కెర సంధ్య, జంజిరా రూపప్రియ, అట్ల సంకీర్తన, బొంకూరి వెన్నెల పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. హైదరబాద్ లాల్‌బహదూర్ స్టేడియంలో ఈనెల 7,8,9,10 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య తెలిపారు. ఈసందర్భంగా ఎంపికైన విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ కుంభాల సుధాకర్, పీఈటీ పాల్గొన్నారు.

గోదావరిఖనిలో 25క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత...

కోల్‌సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని నుండి మహా రాష్ట్రకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం రాత్రి గోదావరిఖని గంగానగర్ వద్ద రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐరాజేష్ ఆధ్వర్యంలో నమ్మదగిన సమాచారం మేరకు గోదావరి వంతెన వద్ద తనిఖీ జరిపారు. గోదావరిఖని నుంచి టాటా ఏస్ వాహనంలో తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకున్నారు. 25క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని డ్రైవర్ అంజనిని అదుపులోకి తీసుకున్నారు.

సుందిల్లలో..

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సుందిల్ల గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం గోదావరిఖని టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. సుందిల్ల నుంచి గోదావరిఖని వైపు ఆటోలో తరలిస్తున్న రెండు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన చింతల రాకేష్ గ్రామాల్లో ప్రజల వద్ద తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు విక్రయించేందుకు తరలిస్తున్న క్రమంలో పట్టుబడినట్టు పోలీసులు తెలిపారు. ఆటోను అదుపులోకి తీసుకుని రాకేష్‌పై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

స్నేహితురాలి కోసం వెళ్లి....

ఆసుపత్రిలో తలదాచుకున్న విద్యార్థిని

● ట్రేస్ చేసి పట్టుకున్న పోలీసులు

మెట్‌పల్లిటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : పాఠశాల నుంచి అదృశ్యమైన పదోతరగతి విద్యార్థినిని మెట్‌పల్లి పోలీసులు ట్రేస్ చేసి శుక్రవారం పట్టుకున్నారు. స్నేహి తురాలిని కలిసేందుకు వెళ్లి ఫోన్ నెంబర్ దొరకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో తలదాచుకుంది. చివరకు విద్యార్థిని తనతాతకు ఫోన్ చేయడంతో ఆనంబర్ ఆధారంగా పోలీసులు ట్రేస్ చేసి విద్యార్థిని అక్షరను పట్టుకోవడంతో తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు. బాలిక అదృశ్యం పట్టణంలో కలకలం రేపడంతో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి గురువారం నుంచి ముమ్మర చర్యలు చేపట్టారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న అక్షర గురువారం మధ్యాహ్నం తన స్నేహితురాలిని కలిసేందుకు పాఠశాల నుంచి నేరుగా మెట్‌పల్లి బస్‌స్టాండ్‌లో నిజామా బాద్ బస్సు ఎక్కింది. నిజామాబాద్ బస్టాండ్‌లో దిగిన అనంతరం తన స్నేహితురాలి అడ్రస్ దొరకకపోవడంతో అక్కడే రాత్రి ఓ ఆసుపత్రిలో తలదాచుకుంది. శుక్రవారం ఉదయం తన తాతకు ఫోన్ చేసి స్నేహితురాలి నెంబర్ ఇవ్వాలని కోరింది. నెంబర్ దొరకకపోవడంతో ఇవ్వలేదు.



నిజామాబాద్ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థినితో సీఐ, పోలీస్ సిబ్బంది, బంధువులు

అప్పటికే విద్యార్థిని కనిపించడం లేదని తెలియడంతో వెంటనే ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపి సంబంధిత నెంబర్ పోలీసులకు తెలుపడంతో సీఐ నిరంజన్‌రెడ్డి నెంబర్‌ను ట్రేస్ చేసి నిజామాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే సీఐ నిజామాబాద్ ట్రాఫిక్ ఎస్‌ఐ సంజీవ్‌ను అప్రమత్తం చేసి బస్టాండ్‌లో బాలికను పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. హుటాహుటిన మెట్‌పల్లి సీఐ, మల్లాపూర్ ఎస్‌ఐ కిరణ్‌కుమార్ నిజామాబాద్ వెళ్లి బాలికను తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

షాజాపూర్‌లో రాఘవపూర్ కళాకారుల ఒగ్గు డోలు ప్రదర్శన




మధ్య ప్రదేశ్‌లో ఒగ్గుడోలు ప్రదర్శిస్తున్న రాఘవపూర్ కళాకారులు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మధ్యప్రదేశ్ రాష్ట్రం షాజాపూర్‌లో గంగౌర్ ఉత్సవ్ పేరుతో ఈనెల 5న నిర్వహించిన వేడుకల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి పెద్దపల్లి జిల్లా మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన ఓంకార్ ఒగ్గుడోలు కళాబృందం ఆధ్వర్యంలో ప్రదర్శన ఇచ్చారు. టీం లీడర్ కుంట సదయ్య, కుంట రాజ్‌కుమార్, కుంట సదయ్య, ఈరు రమేష్, జంగిలి పోచాలు, కుంట సిద్ధార్థతో పాటు 15 మంది కళాకారులు పాల్గొన్నారు.

మెకానికల్ విభాగమే కీలకం..

● ఆర్‌ఎఫ్‌సీఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రమేష్ ఠాకూర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎఫ్‌సీఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రమేష్

రామగిరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ విద్యలోని ప్రతి బ్రాంచ్‌లో మెకానికల్ విభాగమే కీలకమని రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రమేష్ ఠాకూర్ అన్నారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మెకానికల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన ఆర్డుబోటిక్స్ రోబోటిక్స్‌పై రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయస్థాయి వర్క్‌షాప్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుతం ఇంజనీరింగ్ విభాగంలో మెకానికల్‌కు ప్రాధాన్యత తగ్గినా విద్యార్థులు అధైర్య పడవద్దన్నారు. ప్రతి విభాగంలోనూ మెకానికల్ విభాగం ప్రాముఖ్యత, ప్రాధాన్యం ఉంటుందన్నారు. సివిల్, ఎలక్ట్రికల్, మైనింగ్ బ్రాంచ్‌లన్నీ మెకానికల్ బ్రాంచ్‌పై ఆధారపడినవేనని పేర్కొన్నారు. మెకానికల్ విద్యార్థు లకు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. మంథని జేఎన్టీయూ కళాశాలకు ఎలాంటి సహాయ సహకారాలైనా అందించడానికి ఆర్‌ఎఫ్‌సీఎల్ ముందు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్స్ సతీష్‌పడినాల్, శేఖర్ లాల్, ఫ్యాకల్టీ సలహాదారు పి. స్వప్న, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ బి. లోకేష్, శ్రీనాథ్, లావణ్య, సంగీత, ఇతర కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

9న ఉమ్మడి జిల్లా అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు


కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను ఈనెల 9న నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని కరీంనగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్(కేడీసీఏ)నెట్స్‌లో ఉదయం 8 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ఆగమ్‌రావు, ఎన్ మురళీధర్‌రావు, ఉపాధ్యక్షులు కె మహేందర్‌గౌడ్, పి మనోహర్‌రావు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తిగల క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్, ఆదార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలని కోరారు. క్రీడాకారులు సెప్టెంబరు 1, 2010 నుంచి ఆగస్టు 31, 2012 లోపు జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఈ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెలెక్షన్ ఇన్‌చార్జి సీహెచ్ అజిత్‌రావు, బి శ్రావణ్‌కుమార్‌లను 8688768775 నంబరులో సంప్రదించాలని సభ్యులు సూచించారు.

రాష్ట్ర స్థాయి మానేటి లఘుచిత్ర పోటీల పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని లఘు చిత్ర కళాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, కరీంనగర్ ఫిలిం సొసైటీ, తెలంగాణ లఘు చిత్ర నిర్మాతల మండలి సంయుక్తంగా రాష్ట్రస్థాయి మానేటి లఘు చిత్ర పోటీలను నిర్వహిస్తోంది. శుక్రవారం కరీంనగర్ ఫిలింభవన్‌లో పోటీల ప్రచార పోస్టర్‌ను నిర్మాతల మండలి అధ్యక్షుడు తంగెడ అశోక్‌రావు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ షార్ట్ ఫిల్మ్ మేకర్స్‌కు ఈ పోటీలు మంచి అవకాశమని, దీంతో రాష్ట్రస్థాయి గుర్తింపు లభిస్తుందన్నారు. కరీంనగర్ ఫిలిం సొసైటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ ముజాఫర్ మాట్లాడుతూ డిసెంబరు చివరి వారంలో పోటీలు జరుపుతామని, ఎంట్రీలు పంపడానికి చివరి తేదీ డిసెంబరు 15 అని అన్నారు. ఎంపికైన ఉత్తమ లఘు చిత్రానికి 20,000 నగదు, ద్వితీయ లఘు చిత్రానికి 10,000 నగదు, తృతీయ లఘు చిత్రానికి 5,000 నగదు, ఐదు ప్రోత్సాహక బహుమతుల కింద ఒక్కో చిత్రానికి 1000 రూపాయల చొప్పున అందిస్తామని తెలిపారు. డిసెంబరు చివరి వారంలో కరీంనగర్ ఫిలిం భవన్‌లో జరిగే విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాడిశెట్టి గోపాల్, కందల సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగుదామా..జావ

● మారుతున్న ఆహారపు అలవాట్లు ● పెరుగుతున్న జావ విక్రయ కేంద్రాలు



అన్నా చాయ్ తాగుదామా. ఇది అప్పుడు. అన్నా జావ తాగుదామా. ఇది ప్రస్తుతం ట్రెండ్..రుచికి రుచి ఆరోగ్యానికి ఆరోగ్యం అందుకే జనం జావ వైపు మళ్లుతున్నారు. కుప్పలు కుప్పలుగా చాయ్ విక్రయ కేంద్రాల్లా జావ విక్రయ కేంద్రాలు కూడా మెల్ల మెల్లగా ఊపందుకుంటున్నాయి. కరోనా తరువాత జనాల్లో వచ్చిన రకరకాల అనారోగ్య సమస్యలు ఎంతో కొంత మార్పులైతే తీసుకొచ్చింది. కాఫీ,టీలకు బదులు జావ తీసుకోవడం అలవాటు చేసుకుంటున్నారు. ఉదయాన్నే వ్యాయామం చేయడం ఆ తరువాత జావ తీసుకోవడం దినచర్యలో భాగమైపోయింది. రోజురోజుకూ జావ తీసుకునే వారి సంఖ్య పెరిగిపోవడంతో జావ సెంటర్లు కూడా క్రమ క్రమంగా పెరుగుతున్నాయి.

జగిత్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలోని పలు ప్రాంతాల్లో జనం జావ తోవ పడుతున్నారు. 'టీ' కి ప్రత్యామ్నాయంగా జావ తీసుకుంటున్నారు. ఆరోగ్యాన్ని రక్షించుకోవడానికి జనాల్లో ఆహారపు అలవాట్లు రోజు రోజుకూ మారుతున్నాయి. కరోనా సమాజానికి సరికొత్త ఆరోగ్య పాఠాలు నేర్పింది. వైద్యరంగానికి సంబంధించి అనేక విషయాలు తెలిపి పాటించేలా చేసింది. ఆహారపు అలవాట్లను మార్చింది. వ్యాయామ సాధనను పెంచింది. ఇలా అనేక రకాలుగా మార్పులు తెచ్చింది. అందుకే నిత్యం ఆరోగ్యానికి మేలుచేసే ఆహార కేంద్రాలు పుట్టుకొస్తూనే ఉన్నాయి. గతంలో ఉదయం లేవగానే చాలామంది టీ, కాపీ తోనే దినచర్య ప్రారంభించే వారు. కరోనా తరువాత గ్రీన్‌టీ, లేమన్ టీకి మారారు. ప్రస్తుతం మిల్లెట్ మాల్ట్, జావ ట్రెండ్ నడుస్తోంది. బరువు పెరగకుండా దీర్ఘకాలిక వ్యాధులు సోకకుండా జావ ఉపయోగపడుతుందని చాలా మంది దీనిపై ఆసక్తి చూపిస్తున్నారు. జగిత్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో జావవ విక్రయ కేంద్రాలు అందుబాటులోకి రావడంతో స్థానికులు తాగేందుకు ఇష్టపడుతున్నారు.

'టీ'కి ప్రత్యామ్నాయంగా...

ఉదయం సాయంత్రం వ్యాయామం చేసిన అనంతరం సాధకులందరూ స్నేహితులు కలుసుకున్నా. కాలక్షేపం చేయాలన్నా మొదటి వరకు టీ(చాయ్)కి ప్రాధాన్యం ఇచ్చేవారు. ఆయా కేంద్రాల్లో సరదగా గడుపుతుండేవారు. ఆతర్వాత లెమన్, గ్రీన్‌టీ కేంద్రాల బాట పట్టారు. ఇప్పుడు జిల్లా కేంద్రంతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి తదితర ప్రాంతాల్లో నూత నంగా అందుబాటులోకి వచ్చిన జావ విక్రయకేంద్రాల వైపు చూస్తున్నారు. ప్రస్తుతం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈ కేంద్రాలకు గిరాకీ సైతం బాగానే ఉంది. ఉదయం 6గంటలకు మొదలైతే రాత్రి 9గంటల వరకు జావ కేంద్రం కొనసాగుతుండడం గమనార్హం.

ఇంట్లోనూ సిద్ధం చేసుకునేలా...

జావ తాగాలని కాకుండా సొంతంగానూ సిద్ధం చేసుకునేలా జావ డబ్బాలు విక్రయిస్తున్నారు. వేడి నీటిని కాచి సరిపడా పౌడర్‌ను కలిపేస్తే జావ తయారవుతుంది. ఈ జావ రుచి చూసిన పలువురు ఇష్టపడి కొనుగోలు చేస్తున్నారు. ఇంట్లోనే సిద్ధం చేసుకుంటున్నారని కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు.





జగిత్యాలలో జావ విక్రయకేంద్రాల వద్ద జనం

ఆరోగ్యంగా ఉండడానికే...



ఆరోగ్యంగా ఉండడానికి జావ తాగుతున్నారు. నూనెలో కాచిన పదార్థాలు, టీ, కాఫీ కంటే జావ కొంత ఆరోగ్యాన్ని ఇస్తుంది. ప్రస్తుత రోజుల్లో రకరకాల అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. అందుకే చాలా మంది ఆరోగ్యంపై శ్రద్ధ పెడుతున్నారు. ఇందులో భాగంగానే జావ తాగడానికి ఇష్టపడుతున్నాను.

- రవి మెకానిక్, జగిత్యాల

ప్రతీ రోజు సాయంత్రం జావ తీసుకుంటా



కొంత కాలంగా ప్రతీ రోజు సాయంత్రం జావ తీసుకుంటున్నాను. జావ తాగడం వల్ల ఆరోగ్యం బాగుంటుంది. టీ, కాఫీల కన్నా ఎంతో శ్రేయస్కరం ఇది. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ ఉండవు. కడుపులో కూడా చాలా తేలికగా ఉంటుంది. రోజంగాఉల్లాసంగా, ఉత్సాహంగా అనిపిస్తోంది. అందుకే జావ తాగుతున్నాను.

- తిప్పబత్తుల లక్ష్మీనారాయణ, జగిత్యాల

రామగుండం ఎన్టీపీసీలో డైరెక్టర్ రవీంద్ర పర్యటన

● కోల్ భవన్, హెరిటేజ్ భవనాల ప్రారంభం



ఎన్టీపీసీ హెరిటేజ్‌భవన్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ రవీంద్ర

జ్యోతినగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ డైరెక్టర్ (ఆపరేషన్స్) రవీంద్రకుమార్ శుక్రవారం రామగుండం ప్రాజెక్టులో పర్యటించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం ఇక్కడికి వచ్చిన డైరెక్టర్ రవీంద్రకు ఆర్ఈడీ కేదార్ రంజన్‌పాడు, ఇతర అధికారులు స్వాగతం పలికారు. తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టీపీపీ)లో నిర్మించిన కోల్‌శక్తి భన్‌ను డైరెక్టర్ ప్రారంభించారు. అనంతరం రామగుండం ఎన్టీపీసీలో ఏర్పాటు చేసిన హెరిటేజ్ భవన్‌ను ఆయన ప్రారంభించారు. తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టు-1వ యూనిట్ కంట్రోల్‌ను డైరెక్టర్ పరిశీలించారు. కొత్తప్రాజెక్టు పనితీరును అడిగి తెలుసుకున్నారు. తరువాత 2600 మెగావాట్ల రామగుండం ప్రాజెక్టు స్టేజ్-1లోని 200 మెగావాట్ల 1వ యూనిట్ కంట్రోల్ రూంను పరిశీలించి సూచనలు చేశారు.

● ఎన్టీపీసీ భవిష్యత్ సారథులు ఈటీలే..

దేశానికి వెలుగులనందిస్తున్న ఎన్టీపీసీకి భవిష్యత్ సారథులు కొత్తగా చేరిన ఎగ్జిక్యూటివ్ ట్రైనీ(ఈటీ)లేనని డైరెక్టర్ రవీంద్ర కుమార్ అన్నారు. తన పర్యటనలో భాగంగా ప్రాజెక్టులో శిక్షణ తీసుకుంటున్న యువ ఈటీలతో డైరెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగంలో ప్రపంచ స్థాయి సంస్థగా గుర్తింపు పొందిన ఎన్టీపీసీని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలన్నారు. సీనియర్ అధికారుల మార్గదర్శనంలో తమ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకొని ఎన్టీపీసీలో కొత్త ఆవిష్కరణలు చేయాలని ఈటీలను కోరారు. ప్రాజెక్టులను సమర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని అంశాలను నేర్చుకోవాలని డైరెక్టర్ రవీంద్ర కోరారు. అనంతరం డైరెక్టర్ గుర్తింపు యూనియన్, ఇతర యూనియన్ల నాయకులు, అధికారుల సంఘం, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘాలతో సమావేశమయ్యారు. కాగా, శనివారం డైరెక్టర్(ఆపరేషన్స్) 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును సందర్శించనున్నారు. అనంతరం దక్షిణాది రాష్ట్రాల ఎన్టీపీసీ ప్రాజెక్టుల ఆపరేషన్స్ విభాగం అధికారులు, హెచ్‌వోపీలతో జరిగే సదస్సులో డైరెక్టర్ పాల్గొంటారు. డైరెక్టర్ వెంట ఈడీ(ఆపరేషన్స్) మనోహర్, ఆర్ఈడీ కేదార్ రంజన్ పాడు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని విఠల్ నగర్‌లోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఆందోళనకు దిగారు. రామగుండం ప్రాజెక్టు నుంచి అల్లూరు సెక్టార్ విఠల్‌నగర్4(2) కోడ్ నెంబర్ 113 అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న టీచర్ భాగ్యలక్ష్మీ బదిలీపై వెళ్లింది. అదే కేంద్రంలో 13సంవత్సరాలుగా జగదీశ్వరీ హెల్పర్‌గా పనిచేస్తోంది. పదో తరగతి ఉత్తీర్ణత పొందిన జగదీశ్వరీ తనకు టీచర్‌గా అవకాశం కల్పించాలని కోరగా అందుకు నిరాకరించి. మార్కండేయకాలనికి చెందిన హెల్పర్‌కు టీచర్‌గా ఇవ్వటంపై ఆందోళనకు దిగారు. ప్రజావాణిలో కలెక్టర్‌కు జగదీశ్వరీ ఫిర్యాదు చేసింది. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో సీడీపీవో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

జూలపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడుకాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని హరిక్రిష్ణ అనే విద్యార్థి ఉమ్మడి జిల్లా స్థాయిలో అండర్17 విభాగంలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీలలో రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పీడీ మహేందర్ తెలిపారు. ఈనెల7,8,9 తేదీలలో ఆర్మూర్‌లో నిర్వహించే పోటీలలో హరిక్రిష్ణ పాల్గొననున్నట్లు తెలిపారు.

వైభవంగా అయ్యప్ప ఆరట్టు ఉత్సవం



రాయికల్‌లో ఉత్సవమూర్తుల శోభాయాత్ర



కోరుట్లలో ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న స్వాములు

కోరుట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలో అయ్యప్ప ఆరట్టు ఉత్సవం అంబరాన్నంటిం ది. ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన స్వామి వారి రథోత్సవం వైభవంగా సాగింది. అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలను నిర్వహిం చారు. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలను నిర్వహించి మహదేవ స్వామి దేవాలయానికి భజన కార్యక్రమాలతో తీసుకొచ్చారు. అనంతరం ఆలయ ఆవరణలో ఉన్న కోనేరులో గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప స్వాములకు జలాభిషే కంతో పాటు పంచామృత అభిషేకాలను వేదపండితులు పాలెపు రామకృష్ణ శర్మ, పాలెపు భరద్వాజ్ శర్మ, వినయ్ శర్మ, త్రిపాఠి శర్మ, మంత్రోచ్చారణల మధ్య జరిపారు. ఉత్సవ విగ్రహాలకు అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి అలంకరణ నిర్వహించారు. రథోత్సవాన్ని అయ్యప్ప దీక్షాపరులు, భక్తులు, నృత్యాలు చేస్తూ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప జ్ఞాన సరస్వతి దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, కమిటీ సభ్యులు గట్ల ఆనంద్, క్రాంతి, జుంబర్తి రమేష్, తోట రాజు, సభ్యులు పాల్గొన్నారు.

రాయికల్ : అయ్యప్ప ఆరట్టు ఉత్సవం రాయికల్‌లో శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. స్థానిక అయ్యప్ప ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి ఆలయం నుంచి శోభాయాత్ర నిర్వహించారు. అయ్యప్ప దీక్షా పరుల నృత్యాలు, శరణుఘోషతో రాయికల్ మారుమోగింది. శోభాయాత్రలో మహిళలు మంగళహారతులతో స్వాములకు స్వాగతం పలికారు. ఉత్సవమూర్తులకు పెద్ద చెరువులో చక్రస్నానం అనంతరం తిరిగి ఆలయానికి తీసుకువెళ్లారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ పూజారి మునుగోటి సత్యనా రాయణశర్మ, సాయి శర్మ, ఆరట్టు ఉత్సవ దాత సత్యనారాయణ, గురుస్వాములు సింగని రమేష్, మచ్చ శ్రీధర్, శ్రవణ్, శ్రీను. అజయ్, సత్యం, శ్రీను, రాజు, సాయికృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.


రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. గురువారం రాత్రి రాజన్న క్షేత్రానికి చేరుకున్న భక్తులు ఉదయం కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. అనం తరం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

ధర్మపురి గోదావరి వద్ద మల్లన్న భక్తులు..



గోదావరి నది వద్ద స్నానాలు ఆచరిస్తున్న మల్లన్న భక్తులు

ధర్మపురి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నది వద్ద శుక్రవారం మల్లన్న భక్తుల రద్దీ పెరిగింది. సట్టి వారోత్సవాలను పురస్కరించుకుని భారీగా భ క్తులు తరలి వచ్చి గోదావరిలో స్నానాలు చేశారు. నదీ జలాలతో విగ్రహాలను శుభ్రం చేసి పూజించారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకు నేందుకు తిరుగు ప్రయాణం అయ్యారు. పట్నాలు వేసిన మరునాడు వేములవాడ, కొమరవెల్లి, ఓదేల, ఐనవోలు ఆలయాలకు వెళ్లడం ఆనవాయితీగా వస్తున్నది.

ప్రత్యేక తరగతులు... లక్ష్యం వైపు పరుగులు

● పుస్తకాలతో కుస్తీ పడుతున్న పదోతరగతి విద్యార్థులు
● వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేందుకు విద్యార్థులు సన్నద్ధం అవుతున్నారు. ప్రభుత్వ పాఠశాల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ లక్ష్యం వైపు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. మెరుగైన ఫలితాలు రాబట్టాలని ఉపాధ్యాయులు విద్యార్థులతో సాధన చేయిస్తున్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక సిద్ధంచేసి పాఠ్యాంశాల వారీగా అమలు చేస్తున్నారు.

● సందేహాలను నివృత్తి చేస్తూ ..

పదో తరగతి పరీక్షలు సమీపంలో ఉండటంతో ఆయా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. ఉదయం, సాయంత్రం ఒక్కో సబ్జెక్ట్ టీచర్లు విద్యార్థులను గ్రూపుల వారీగా విభజించి పాఠ్యాంశాలను పునఃశ్చరణ చేయిస్తున్నారు. గతంలో నిర్వహించిన వార్షిక పరీక్షల ఆధా రంగా పాత ప్రశ్నపత్రాలతో పరీక్షలు నిర్వహిస్తూ సమగ్ర మూల్యాంకనం చేస్తున్నారు. చదువుతున్న వేళ వారికి వస్తున్న సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో గుర్తిస్తూ.. ఆయా విభాగాల ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తూ ఉత్తీర్ణతశాతం పెంచడమే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

● అల్పాహారం కోసం విద్యార్థుల ఎదురుచూపులు

ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణ కొనసాగుతోంది. ఉదయం విద్యార్థులు హడావిడిగా ఏమీ తినకుండా వస్తున్నారు. మధ్యాహ్న భోజనంతో ఆకలి తీర్చుకుంటున్నారు. సాయంత్రం అల్పాహారం దొరకకపోవడంతో ప్రత్యేక తరగతుల వేళ విద్యార్థులు అలమటిస్తున్నారు. దాతలు ఎవరైనా స్పందించి విద్యార్థుల సౌలభ్యం కోసం అల్పాహారం ఏర్పాటు చేయాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు కోరుతున్నారు.



చెల్పూర్ జడ్పీహెచ్ఎస్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

ప్రధాన పరీక్షల భయం తొలగింది



ఆంగ్లం, గణితం, సామాన్యశాస్త్రం అంటే భయం ఉండేది. ప్రత్యేక తరగతుల వల్ల భయం తొలిగిపోయింది. ఉపాధ్యాయులు మా సందేహాలను చక్కగా నివృత్తి చేస్తున్నారు. ఆంగ్లంలో వ్యాకరణం, సామాన్యశాస్త్రంలో చిత్రపటాలు, గణితంలో సూత్రాలపై పట్టు సాధించి వార్షిక పరీక్షల నాటికి పూర్తిగా సన్నద్ధమవుతాం. మంచి గ్రేడ్లు సాధిస్తాం.

- మౌనిక, పదో తరగతి విద్యార్థి, సిర్సపల్లి

గ్రూపులుగా విభజించి చెబుతున్నారు



ఆయా పాఠ్యాంశాల్లో మా ప్రతిభను గుర్తించి గ్రూపులుగా బోధన చేస్తున్నారు. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులు రాణించేలా ఒకటికి రెండుసార్లు బోధన చేస్తున్నారు. స్లిప్ టెస్టుల ఆధారంగా విద్యార్థుల ప్రతిభను గుర్తించి గ్రూపులుగా విభజించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నోట్స్ అందజేస్తున్నారు.

-సూత్రాల హర్షిత్, పదో తరగతి విద్యార్థి, జడ్పీహెచ్ఎస్ చెల్పూర్

ఉత్తమ ఫలితాలు సాధించేందుకు



విద్యార్థులకు పదో తరగతి ఎంతో కీలకం. ఇక్కడ నుంచి గ్రేడ్లు సాధిస్తేనే భవిష్యత్తులో ఉపయోగపడుతాయి. అందుకు పక్కా ప్రణాళిక రచించుకొని ముందుకు సాగుతున్నాం. గతంలో మాదిరిగా వందశాతం ఫలితాలు రావడంతో పాటు 10 జీపీఏ సాధించే దిశగా సన్నద్ధం చేస్తున్నాం. సంబంధిత ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులు వారి సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. ఉత్తమ గ్రేడు సాధించేలా విద్యార్థులను ప్రోత్సాహిస్తున్నాం.

- అనురాధ, హెచ్‌ఎం, చెల్పూర్

'తెరసం' సాహిత్య సభల కరపత్రం ఆవిష్కరణ

గణేశ్‌నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం జరిగే తెలంగాణ రచయితల సంఘం(తెరసం) పదేళ్ల సాహిత్య సభల కరపత్రాని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో ప్రిన్సిపల్, తెరసం జిల్లా పూర్వ అధ్యక్షుడు ఆచార్య కలువకుంట రామకృష్ణ శుక్రవారం ఆవిష్కరించారు. సాహిత్య సభలకు ఉమ్మడి జిల్లా నుంచి కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొత్త అనిల్‌కుమార్, ప్రచార కార్యదర్శి గంగుల శ్రీకర్ పాల్గొన్నారు.

ఘనంగా శతచండీ యాగం

భగత్‌నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో శతచండీయాగం శుక్రవారం ప్రారంభమైంది. శనివారం సాయంత్రం శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వర కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొనాలని కోరారు.

సమగ్ర సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి

కరీంనగర్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో సమగ్ర కటుంబ సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తయ్యింది. 50 మంది ఆపరేటర్లను నియమించి కరీంనగర్ మండలంలో 10,831 కుటుంబాల వివరాలను నమోదు పూర్తిచేశారు. శుక్రవారం ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించారు. ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ఇందిరమ్మ ఇళ్ల సర్వే

కరీంనగర్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులపై అర్హులైన వారిని గుర్తించేందుకు సర్వే శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సంజీవరావు తెలిపారు. శుక్రవారం కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో గూగుల్ మీట్ కార్యక్రమంలో భాగంగా మండల కార్యదర్శులతో ఆయన ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకు ముందు అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు ఘన నివాళి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి, నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, మేడిపల్లి సత్యం

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): **భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయనకు పలువురు వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు శుక్రవారం ఘన నివాళులర్పించారు.** జిల్లా కాంగ్రెస్ కార్యాలయం, నగరంలోని కోర్టు చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపెల్లి మోహన్ హాజరయ్యారు.

కరీంనగర్ టౌన్: నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పూలమాల వేసి నివాలులర్పించారు. బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్ ఐలేందర్‌యాదవ్ పాల్గొన్నారు. నగరపాలక సంస్థ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొన్నారు. టీడీపీ కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు బోలుమల్ల సదానందం, టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి దామెర సత్యం పాల్గొన్నారు.

భగత్‌నగర్: నగరంలోని కోర్టు చౌరస్తాలోగల అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా దళితమోర్చా అధ్యక్షుడు సోమిడి వేణు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం నగర కార్యదర్శి గడికందుల సత్యం, రాంపల్లి శ్రీనివాస్, సదానందం తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కరీంనగర్ లోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఎస్టీ,ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కరీంనగర్ జోన్ ఈడీ ఖుస్రోషాఖాన్ అంబేద్కర్‌కు నివాళులు అర్పించారు.

సుభాష్‌నగర్: నగరంలోని కోర్టు చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సభ్యుడు ఎలుక ఆంజనేయులు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కాడె శంకర్, దళిత నాయకుడు మెడి చంద్రశేఖర్, రైతు, ప్రజా సంఘాల జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని తెలంగాణ సాహితీ జిల్లా శాఖ కార్యాలయంలో జరిగిన అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్, తెలంగాణ రాష్ట్ర సాహితీ కార్యదర్శి మాడుగుల రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి మానవాడ శంకర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పురుషోత్తం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు పెద్దెల్లి శ్రీనివాస్, కడారి గంగరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తదితరులు పాల్గొని అంబేద్కర్‌కు నివాళుర్పించారు.

హుజూరాబాద్/హుజూరాబాద్ లీగల్/జమ్మికుంట/శంకరపట్నం/ఇల్లందకుంట/సైదాపూర్/వీణవంక/మానకొండూర్/తిమ్మాపూర్/గంగాధర/చిగురుమామిడి/రామడుగు: హుజూరాబాద్ పట్టణం, శంకరపట్నం, సైదాపూర్ మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ తదితర పార్టీలు, ప్రజా సంఘాలు, అంబేద్కర్ వాదులు, రైతు ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో బీఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. హుజూరాబాద్ కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోస్కుల శ్రీనివాస్, కార్యదర్శి మట్టెల తిరుపతి, ఏపీపీ రాం ఉపేందర్, ఏజీపీ గుర్రం శ్రీనివాస్, న్యాయవాదులు పాల్గొన్నారు. జమ్మికుంట పట్టణంలోని మోత్కులగూడెం చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి, పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య హాజరయ్యారు. ఇల్లందకుంట మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీణవంక మండలంలోని కొండపాకలో జరిగిన కార్యక్రమంలో నాయకులు ఈదునూరి ఫైడికుమార్, రామగుండం రాజ్‌కుమార్, ఎండీ ఫయాజ్ అలీ ఉన్నారు. మానకొండూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ సుడా చైర్మన్ జీవి రామకృష్ణారావు, మాజీ జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, గసిగంటి సంపత్, టి సంపత్‌గౌడ్ పాల్గొన్నారు. తిమ్మాపూర్ మండలంలో అంబేద్కర్ సంఘ నాయకులు పొరునంది జలపతి, మాతంగి శంకర్, మాతంగి లక్ష్మణ్, వంతడుపుల సంపత్ పాల్గొన్నారు. గంగాధరలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో రాము, తహసీల్దార్ అనుపమ, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు. చిగురుమామిడిలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ ముద్దసాని రమేశ్, ఎంపీడీవో బాస మధుసూదన్ పాల్గొన్నారు. రామడుగులో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జవ్వాజి హరీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేణి తిరుమలతిరుపతి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మేయర్ సునీల్‌రావు, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

పదేళ్ల అభివృద్ధి ఏడాదిలో విధ్వంసం

(1వ పేజీ తరువాయి)

కలుగుతుందని ఆయన అన్నారు. టీటీడీ నిధులతో వేంకటేశ్వరస్వామి దేవాలయం నిర్మించేందుకు పది ఎకరాల భూమిని కేటాయించాము.. ఇటీవలే టీటీడీ చైర్మన్‌ను కలిశాము.. త్వరలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి దేవస్థానం నిర్మాణ పనులను చేపట్టాలని కోరుతామని కమలాకర్ అన్నారు. గంగుల కమలాకర్‌పై కోపం ఉంటే వ్యక్తిగతంగా తీర్చుకోండి... అంతేకానీ జిల్లా అభివృద్ధిని అడ్డుకోవద్దని ఆయన అన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జిల్లాకు వచ్చి అభివృద్ధిని సమీక్షించడం లేదు. జిల్లాలో ఉన్న మంత్రులు పట్టించుకోవడం లేదు. ఏడాది కాలం వేచి చూశాం.. ప్రజలు ప్రశ్నించడం ప్రారంభించారు.. ఇక మేము కూడా ఈ వివక్షను ప్రశ్నిస్తూ పోరాటం చేపడతాం అని కమలాకర్ అన్నారు.

యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా ముత్యం శంకర్, మహ్మద్ అజీమ్



మహ్మద్ అజీమ్

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా ముత్యం శంకర్, మహ్మద్ అజీమ్ ఎన్నికయ్యారు. ఆన్‌లైన్ ఓటింగ్ విధానంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఫలితాలను డీసీసీ కార్యాలయం శుక్రవారం విడుదల చేసింది. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకా ర్యదర్శిగా కరీంనగర్‌కు చెందిన పడాల రాహుల్ విజయం సాధించారు. కరీంనగ ర్, మానకొండూర్, చొప్పదండి, హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షులుగా పంజాల కృపసాగర్, అట్ల అనిల్‌ముదిరాజ్, వొడ్నాల యజ్ఞేష్ పటేల్, చల్లూరి రాహుల్ ఎన్నికైనట్లు తెలిపారు. యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి మహ్మద్ అజీమ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల మన్ననలు పొందారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శనివారం ఉదయం 9:30 నుంచి 11:30 వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్, టు, ఏడీఈ లు పంజాల శ్రీనివాస్‌గౌడ్, ఎం లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ చౌక్ ఏరియా, కాశ్మీర్ గడ్డ, ముకురంపుర, టూ టౌన్ ఏరియా, ఫైర్ స్టేషన్ ఏరియా, శ్రీనగర్ కాలనీ రోడ్ నంబర్ వన్, హనుమాన్ చౌరస్తా ఏరియా, వెంకట్ సాయి, కాపువాడ, పద్మశాలి వీధి, పాత బజార్, లక్ష్మీనగర్‌లో కొంత భాగం, కమాన్ నుంచి హౌసింగ్ బోర్డ్ రోడ్డు, వెంకట్ సాయి రోడ్, శివాలయం టెంపుల్, మంగలివాడ, అశోక్‌నగర్, కాపువాడ, గాంధీ స్కూల్ ఏరియా, బొమ్మకల్ రోడ్, అహ్మద్‌పురా, బొమ్మవెంకన్న భవనం ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రూ.50 కోట్ల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నియోజకవర్గ పరిధిలోని 195 మంది లబ్ధిదారులకు 50 కోట్ల 11 లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ కోసం అనేక మంది దరఖాస్తులు చేసుకున్నారని, వాటిలో దశలవారీగా మంజూరవుతున్న చెక్కులను లబ్ధిదారులకు సమాచారమిచ్చి అందజేస్తున్నామన్నా రు. కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, బీఆర్‌ఎస్‌నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు జంగిలి ఐలేందర్‌యాదవ్, గుగ్గిళ్ల జయశ్రీ, కచ్చు రవి, నాయకులు గందె మహేశ్, తిరుపతినాయక్, గడ్డం ప్రశాంత్‌రెడ్డి, జెల్లోజు రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మానేరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌లో శనివారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న 68వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్-17 బాలబాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా ఎంపిక పోటీల్లో రాణించిన మల్లేష్, మన్విత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు.

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు పారమిత విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పారమిత పాఠశాల హెచ్‌ఎం బాలాజీ

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9 నుంచి 13 వరకు ఢిల్లీలో నిర్వహించనున్న జతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు పారమిత పాఠశాల విద్యార్థిని ఎంపికైంది. ఇటీవల హన్మకొండలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ 68వ బాలికల బాక్సింగ్ పోటీల్లో పాఠశాలకు ఉచెందిన పి రచన బంగారు, పి సిమిత్రరెడ్డి రజత పతకాలు సాధించగా, రచన జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని చైర్మన్ డాక్టర్ ఇ ప్రసాదర్‌రావు, డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనూకర్ రావు, వినోద్‌రావు, వీయుఎం ప్రసాద్, టీఎస్‌పీ రమణ, హనుమంతరావు అభినందించారు.

టగ్ ఆఫ్ వార్ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి అభినందన

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కొరిమి సంతోష్‌కుమార్‌ను పలు క్రీడా సంఘాల బాధ్యులు శుక్రవారం సన్మానించారు. శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెదిన సంతోష్ ఇటీవల జరిగిన రాష్ట్ర టగ్ ఆఫ్‌వార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా తెలంగాణ యోగా, రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, మహ్మద్ కరీం, ఫిజికల్ డైరెక్టర్ బత్తిని జ్యోతి, సీనియర్ ఖో-ఖో క్రీడాకారులు జనగాం శ్రీనివాస్‌గౌడ్, పూదరం మొగిలి సంతోష్‌ను అభినందించారు.

వాణిజ్యపన్నులశాఖ జేసీకి సన్మానం

కరీంనగర్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాణిజ్యపన్నులశాఖ వరంగల్ నోడల్ జాయింట్ కమిషనర్ రావుల శశిధరాచారిని తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముజాహిద్ హుస్సేన్, టిసిటి ఎన్జీవోస్ సంఘం వరంగల్ డివిజన్ అధ్యక్షుడు గోపి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శశిధరాచారిని శాలువతో సన్మానించి, పలు సమస్యల ను ఆయన దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషిచేయాలని కోరారు.

దివ్యాంగులపై వివక్ష చూపొద్దు

గన్నేరువరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులపై వివక్ష చూపొద్దని ఎంఈవో కె రామయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాయంలో శుక్రవారం నిర్వహించిన దివ్యాంగుల క్రీడాపోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సాయి శిరీష, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల కార్యవర్గం

రామడుగు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ మండల శాఖ ఎన్నిక శుక్రవారం జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కేతిరి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.. అధ్యక్షుడిగా గజ్జెల నల్లగొండయ్య, ప్రధాన కార్యదర్శిగా భూక్య ఉమాపతి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను గౌరవాధ్యక్షులుగా పాతూరి రాజిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మండల ఆనందం, చిందం రమేశ్ శుభాకాంక్షలు తెలిపారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మానకొండూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పశు వైద్య శిబిరాలను మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలు అన్నారు. మండలంలోని అన్నారం, దేవంపల్లి, లక్ష్మీపూర్ గ్రామాలలో శుక్రవారం పీవి నర్సింహారావు వెటర్నరీ, కోరుట్ల, జగిత్యాల జిల్లాల పశు వైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సాకారం, అంబిక, ఎం శ్రీనివాస్‌రెడ్డి, పశువైద్యులు సుశ్మితారెడ్డి, అరవింద్‌రెడ్డి, అభిలాష్‌రెడ్డి, విశాల్, ప్రయాంక, జగన్‌మోహన్‌రెడ్డి, సురేష్, రవికాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల నిర్వహణపై సమీక్ష

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీవో కార్యాల యంలో మండల స్థాయి సీఎం కప్ పోటీల నిర్వహణపై శుక్రవారం సమీక్ష నిర్వహించా రు. ఎంపీడీవో సునీత మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, వాలీబాల్, యోగా పోటీలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ కనుకయ్య, ఎంఈవో శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సారయ్య, మండల పంచాయతీ అధికారి సతీష్ ఉన్నారు.

విగ్రహాల ముసుగు తొలగించాలని రాస్తారోకో



తిమ్మాపూర్ వద్ద రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేస్తున్న నాయకులు

తిమ్మాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ముసుకు తొలగించాలని మండల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాలకులు మహ నీయుల విగ్రహాల ముసుగును తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో జేఏసీ నాయకులు, అంబేద్కర్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం



పిల్లలకు అన్నప్రాసన చేస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్

కరీంనగర్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయమని అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ అన్నారు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ మండలం లోని గోపాల్‌పూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మహిళలు తమ సమస్యలు ఏవైనా ఉంటే శుక్రవారం సభలో విన్నవించుకోవచ్చని తెలిపారు. సభానంతరం దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తామని అన్నారు. గర్భిణులు, బాలింతలు సహా ప్రతి మహిళ శుక్రవారం సభకు తప్పక హాజరుకావాలని సూచించారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి కర్ర సబిత, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాజిదా, డీసీపీవో పర్వీన్, ఎంపీడీవో సంజీవ్, వైద్యాధికారి శోభ, సూపర్‌వైజర్ నిర్మల, పోషన్ అభియాన్ కో ఆర్డినేటర్ నాగరాజు, సతీష్, సఖి అడ్మిన్ లక్ష్మి, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ శ్రీలత, ప్రధానోపాధ్యాయులు రవీందర్, కార్యదర్శి విజయ పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: బాలికలు ఉన్నత చదివే లక్ష్యంగా ముందుకు సాగి ఉద్యోగంలో స్థిరపడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వప్న సూచించారు. దన్‌గర్‌వాడీ బాలికల హైస్కూల్‌లో బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: అనారోగ్యం బారిన పడకుండా ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ అన్నారు. కొత్తగట్టు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారంసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ సన, సీఐడీఎస్ సూపర్‌వైజర్ సరిత, అంగన్‌వాడీ టీచర్లు భారతి, విజయ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని గంగిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల తలెత్తే అనార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యుడు మురళీమోహన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకులకు సన్మానం

గన్నేరువరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల యూత్ కాంగ్రెస్ జిల్లా, మండల స్థాయి ఎన్నికల్లో గెలుపొందిన నాయకులకు శుక్రవారం సన్మానం చేశారు. మండల కేంద్రానికి చెందిన దేశరాజు అనిల్ యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శిగా, రాపోలు నవీన్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా, దేశరాజు నవీన్ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధానకార్యదర్శిగా గెలుపొందారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి బొడ్డు సునీల్, కరుణాకర్‌రెడ్డి, విజయేందర్, నక్క తిరుపతి పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా శ్రీనివాస్

ఇల్లందకుంట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలానికి చెందిన కొత్త శ్రీనివాస్‌ను బీజేపీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా శుక్రవారం నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి శ్రీనివాస్‌కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

'కాంగ్రెస్ ఏడాది పాలన విఫలం'

చొప్పదండి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఏడాది పాలన విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. చొప్పదండిలో పోరు బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భారీ వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మట్లాడుతూ కాంగ్రెస్ పాలన రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలిచ్చిందని ఎద్దేవాచేశారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని చెప్పారు. ఆరుగ్యారంటీల పేరిట ఇచ్చిన హామీల్లో చాలా వరకు నెరవేర్చలేదన్నారు. వీటిని పట్టించుకోకుండా ఏడాది పాలన సంబరాలు నిర్వహించడం సిగ్గు చేటన్నారు. ప్రజలే రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్‌కుమార్, బత్తుల లక్ష్మీనారాయణ, తాళ్లపల్లి శ్రీనివాస్, చేపూరి సత్యం, రామానుజన్, సింగిరెడ్డి కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం



జగ్గయ్యపల్లి గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలో శుక్రవారం ఇంటింటా తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఇళ్లు లేని నిరుపేదలందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. తాగునీటి సమస్యను తీర్చేందుకు గాను బావి నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరు చేస్తానని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. వీవో భవనాలు, సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని మహిళలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్ రవీంద్రాచారి, ఏఎంసీ చైర్మన్ ఎం ఓదెలు, డీసీసీ ప్రధాన కార్యదర్శి టి సంపత్‌గౌడ్, వైస్ చైర్మన్ ఆర్ తిరుమల్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు కోండ్ర సురేష్, ఆర్ తిరుపతి, మడుపు ప్రేమ్‌కుమార్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

● తిమ్మాపూర్: మండల కేంద్రంలోని ఆది త్య పొదుపు సహకార సంఘంలో సభ్యుడైన బూర సాయికుమార్ ఇటీవల మరణించగా బాధిత కుటుంబానికి పొదుపు సంఘం సభ్యులు శుక్రవారం బీమా సొమ్ము 81,362 రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో పోరండ్ల సమితి అధ్యక్షుడు గుంటి వెంకటేశ్వర్లు, ఆదిత్య సంఘం అధ్యక్షుడు వోరుగంటి సంతోష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజు, పాలకవర్గ సభ్యులు మాధనవీరయ్య, మాదన శ్రీనివాస్, జగ్గరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని శాలపల్లి-ఇందిరా నగర్ గ్రామంలో వంద రోజులు ఉపాధిహామీ పనులు పూర్తి చేసిన ఒక్కొక్కరికి 2,016 రూపాయలు, 25 కేజీల బియ్యాన్ని మాజీ సర్పంచ్ కొడిగూటి శారద ప్రవీణ్‌కుమార్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

● జమ్మికుంట రూరల్: జమ్మికుంటలోని సెయింట్ జోసఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సునిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు కూతురు శ్రీపతిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం మాజీ ఎంపీపీ కొత్త వినీత-శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అంజయ్య, మాజీ వైస్ ఎంపీపీ భవాని-శివప్రసాద్, ఎండీ సర్వర్ పాషా, కూతురు శరభందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో శ్రీ ఆంజనేయరెడ్డి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన పీచు రామకృష్ణారెడ్డిని శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు దాసరి కనకయ్య, ప్రధాన కార్యదర్శి దాసరి చంద్రయ్య, గౌరవ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

- రామడుగు మండలంలోని వన్నారంలో అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవ్వాజి హరీష్ దుస్తులను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, భారతి తదితరులు ఉన్నారు.

● గణేశ్‌నగర్: అందం ఆనందాన్ని సంతోషాన్ని కలిగించడంతో పాటు ఆత్మవిశ్వాసం కలిగిస్తుందని మేయర్ సునీల్‌రావు అన్నారు. నగరంలోని ఫిలింభవన్‌లో జరిగిన సక్సెస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ బ్యూటీ సొల్యూషన్స్ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.